# 46
# ఇంతేలే పేదల బతుకులు

'లియోనార్డో డావిన్సీ' గొప్ప భవిష్యదృష్టి ఉన్నవాడంటారు. ఎన్నో శతాబ్దాల క్రిందట ఊహించినవన్నీ ఆధునిక శాస్త్రం 'నిజం' చేసింది. అలాగే జూల్స్‌వెర్న్ రాసిన చాలా కాల్పనిక గాథలను, నేటి సాంకేతిక వైజ్ఞానిక శాస్త్రజ్ఞులు 'నిజం' చేసుక్కొచున్నారు. అంటే ఒకనాటి లియొనార్డో డావిన్సీ, మొన్నటి జూల్స్‌వెర్న్‌ల ఆలోచనా సరళీ, దూర దృష్టి, ఎంత నిశితమైనవో మనం సులభంగా ఊహించవచ్చు. అప్పటికున్న పరిస్థితులను, బాగా అవగాహన చేసుకొని, ఆ సంస్కార బలంతో, ముందు ముందు ఎలాంటి పరిణామాలు రావచ్చునో, రావడానికి అవకాశమున్నదో వారు దశాబ్దాల ముందుగా ఊహించారు. వారి ఊహలు, కాస్త అటూ ఇటూగా నిజమయ్యాయి. వారి కాలం నాటివీ, అంతకు ముందున్నవీ కూడా ఎన్నో మార్పులు చెందాయి. ఈ మార్పులు ఎంతదాకా పోయాయంటే, అసలు వస్తువు, తాలూకు స్వతసిద్ధమైన రూపం ఎలా ఉంటుందో మనం చెప్పుకోలేకుండా ఉన్నాం. అప్పటికీ, ఇప్పటికీ ఎలాంటి మార్పు లేకుండా ఉన్నది 'ఇటుక'.

మరీ అనాది కాలంలో పచ్చి ఇటుకలుండేవేమోగానీ- నిప్పుతో మచ్చిక ఏర్పడిన తరువాత ఆ నిప్పులను రకరకాల పనులకు ఉపయోగించడం మనిషి నేర్చుకొన్నాడు. ఆ ఉపయోగాల్లో మట్టి పాత్రలను, ఇటుకలను కాల్చడం కూడా వొకటి. "ఆల్ఫాన్సో" వర్ణ చిత్రాలలోనూ, శివనాథ బెనర్జీ రేఖా చిత్రాలలోనూ, ఇటుకలు రమణీయంగా కనబడవచ్చు గాక, వాస్తవానికి ఇటుకలను తయారు చేయడంలో సౌందర్యంలేదు. శారీరక శ్రమ మాత్రమే ఉన్నది. ఈ శ్రమ అతనికి కడుపునిండా తిండి పెట్టదు. ఒంటినిండా గుడ్డనూ ఇవ్వదు. 'కాదన్నవారు, రాముల్ని చూడడం మంచిది'. రాములు వయస్సు 34 దాటలేదంటే మనం నమ్మలేం! మనిషి తీగలా ఉన్నా, వొంటిమీద కణికెడు మాంసం దొరకదు. ఉన్న శక్తినంతా చేతికండల్లోకి పుంజుకొని, హుమ్మంటూ గడ్డపారను నేలలోకి దించి తాను వెనక్కువాలుతూ, తనతో బాటుగా గడ్డపలుగును కూడా గుంజుకుంటూ, రెండు పల్లికలకు సరిపడే ఒండ్రు పెళ్ళను పెకలిస్తున్నప్పుడు, అతని నరాలు చర్మాన్ని తొలుచుకొని, బయటికొస్తాయేమోననిపిస్తుంది. ఉన్న కండలన్నీ, నడుంమీంచి భుజాల మీదకి జరిగి, ఆ పెళ్ళను విరవడంలో అతనికి సాయపడుతున్నాయేమోననిపిస్తుంది.

ఒక్కో గునపం పోటు కస్సుమని భూమిలోకి దిగుతుంటే, రాములు శరీరంమీద చెమట, ఎండకు తళతళ మంటుంది. పెళ్ళ మరీ పెద్దదయినప్పుడూ, మామూలు ఊపుకు గడ్డపార వెనక్కు వంగనప్పుడూ రాములు పళ్ళు బిగబట్టి, తన బరువంతా గడ్డపారమీదకు కేంద్రీకరించి, దాన్ని కిందకి దిగలాడుతున్నప్పుడు, అతని కంఠనాళాలు దారుణంగా ఉబుకుతాయి. తలగుడ్డ జారిపోతే, మెడవిదిలించి, దాన్ని కిందికి తోసేస్తాడే తప్ప- అనుకొన్న గుర్తు దాకా, గడ్డ విరగదీయడం మాత్రం మానడు. అలా మానేస్తే అతని నోరూ, తిండిని మానేయాలిసొస్తుంది పాపం!

భూదేవి గుండెలతో ఆడుకోవటం అతని వంశంలోనే ఉంది. అతని తండ్రి, తాత, ముత్తాత, ఆయన ముత్తాత కూడా 'ఉద్దేగ'లోనే ఉండేవారు. వాళ్ళ తాతకు, నడుముకు బిళ్లలతాడు, కాలికి వెండి కడియం ఉండేవిట. రాములు ముత్తాత, తాతగారు అంతకన్నా ముందాయనో మరి, నిజాం నవాబు 'మిద్దెల్కి' ఇటుకలు సరఫరా చేసిన సంగతిని గర్వంగా చెప్పుకొంటాడు రాములు.

రాములు అయ్య - పేటలో ఉండే దొరగారి 'గది'కి ఇటుకలు కాల్చాడంట! ఒకసారి, సమయానికి సరుకు అందివ్వనందుకు ఉడుకు నీళ్ళు మీద దిమ్మరించాడట దొర. (అబద్దం దొర దిమ్మరించి ఉండడు. ఇంకొకనిచేత ఆపని చేయించి ఉంటాడు)

అప్పుడెప్పుడో మహబూబ్‌నగర్‌లో ఉండే రాములు అయిదారేళ్ళ కిందట కూకట్‌పల్లి ప్రాంతాలకొచ్చాడు.

"అక్కడేమున్నయ్యండీ ఏడవ్‌టానికి! నారెక్కలు నాకాడే ఉండె. నా దరిద్రం నా యెనకే ఉండే" అన్నాడు రాములు కాస్తంత దిగులుగా.

అతను చేసిన ఇటుకలు, దొరలు బంగళాల్లో పెద్ద పెద్ద కంపెనీల్లో ఉన్నాయ్. హౌసింగ్ బోర్డు కాంట్రాక్టర్లకు, అతను ఇటుకలు సప్లయ్ చేస్తూ ఉంటాడు. "అది కూడా గిట్టద్దొర! సవగ్గా అడుగుతరు. ఇయ్యకపోతే బువ్వెల్దు. ఇచ్చి నామనుకోరి కూలిపడదు" అంటాడు రాములు.

ఊరికే ఉంటే పొట్ట గడవదు. అందుకోసం, భార్యనూ ఇద్దరు బిడ్డల్నూ కూడా పనిలో పడేశాడు రాములు. ఇతను గడ్డ ఇరుస్తూంటే పిల్లలు దాన్ని నలగ్గొడుతుంటారు. చిన్న చిన్న రాళ్ళు రప్పలు ఏరి పారేస్తుంటారు. పెళ్ళాం నీళ్ళుపోసి మట్టి నానపెడుతుంది. ఆవిడ మట్టి సుద్దలు చేస్తుంటే- పిల్లలు రేకులమీద పెట్టుకొని, ఆ రేకులకు తాళ్ళు కట్టి తండ్రి దగ్గరకు లాక్కొస్తుంటారు. ఆ మట్టిలో అతను ఇటుక కోస్తుంటాడు.

"సినుకు పడితే పానం ఎగిరిపొద్ది దొర! అంతా మట్టిపాలవుద్ది... ఒక్కోసారి ఆవమీదున్నప్పుడు ఆనపడితే సేతికేమీ రాదు. అరపచ్చియి, చిట్టెం కట్టినయి వోరూ కొనరు" అన్నాడు రాములు చుట్టకాలుస్తూ.

నిరుడు బాగానే దిగుబడి వచ్చిందిట. కానీ - తను తాగి పడుకొన్నప్పుడు లారీ మీదొచ్చి సరుకంతా పట్టుకెళ్ళారు. ఏదోకాడికి అమ్ముకోకపోతే రోజు గడవదు.

కొన్ని వేల ఇళ్ళకు ఇటుకల్ని సరఫరా చేసిన రాములు, చిన్న పూరిగుడిసెలో ఉంటున్నాడు.

భగవద్గీతలో శ్రీకృష్ణపరమాత్ముడన్నట్లు- అతను శ్రమపడుతున్నాడు, ఫలితాన్ని..

ఇలాంటి రాములు, కూకట్‌పల్లి దగ్గర్లోనే కాదు, దేశంలో ఏ మూలకెళ్ళినా, కుసుకుసులాడుతూ కనపడుతూనే ఉంటారు.